

గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి : కలెక్టర్

కడప : గృహ నిర్మాణాల్లో నిర్దేశిత లక్ష్య సాధన దిశగా అడుగులేసేలా ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా లతో కలిసి వీసీలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయా మండలాలు, మున్సిపాలిటీలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అంగన్వాడీల ఆగ్రహం

- కలెక్టరేట్ వద్ద ధర్నా
- వేలాదిగా హాజరైన కార్యకర్తలు, ఆయాలు
- అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ధర్నాకు జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కదం తొక్కుతూ వేలాదిగా హాజరయ్యారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే అంగన్వాడీల సత్తా ఏమిటో చూస్తారంటూ హెచ్చరించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ అర్హులైన ఆయాలకు కార్యకర్తలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే తెలంగాణా కంటే అధిక వేతనాలు ఇస్తామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ పనిభారాన్ని తీవ్రంగా పెంచాయని విమర్శించారు. ఆ మేరకు వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కర్ణాటకలో అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేస్తుండగా, ఈ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు. శ్రీనివాసులు రెడ్డి, బి.మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఫుడ్ కమిషనర్ చైర్మన్ చిత్తా ప్రతాపరెడ్డి అంగన్వాడీ కేంద్రాలపై ప్రతాపం చూపకుండా ప్రభుత్వం నుంచి రావాల్సిన మంజూరయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రస్థాయి అంగన్వాడీల పోరాటానికి ప్రత్యక్ష మద్దతునిస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు, అంగన్వాడీలకు జాబ్ కాలండర్ ను నిర్ణయించాలని తెలిపారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. హెల్పర్లకు ప్రమోషన్ల విషయంలో వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ మాజీ కార్యదర్శి ఐ. ఎన్. సుబ్బమ్మ మాట్లాడుతూ పోషణ మెనూ ఛార్జీలను పెంచాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, జిల్లా నాయకులు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, వివిధ ప్రాజెక్టులకు చెందిన నేతలు అంజలీదేవి, కుష్మావతి, భాగ్యయమ్మ, వినోద,విజయ, అంజనా దేవి,సుంకర రవి, నాగేంద్ర బాబు, వెంకటసుబ్బయ్య, దీప,సుబ్బలక్ష్మి, డి. ఎం. ఓబులేసు, సత్యం, రాజామణి, అంగన్వాడీ కార్మికులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆయాలు హాజరయ్యారు.

ఆర్‌డి ఆఫీస్ లీలలు

- ఫేక్ ఉత్తర్వుల ముసుగులో సూపరింటెండెంట్ సస్పెన్షన్
- అవిధేయత, పనితీరు సరిగాలేదనే పేరుతో కలరింగ్
- కోర్టుకెళ్లే యోచనలో బాధిత పర్యవేక్షణాధికారి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్‌డి కార్యాలయం పోస్టుల భర్తీ వ్యవహారం లీలలను తలపిస్తోంది. ఈ ఏడాది జనవరి మాసంలో కడప జోన్ పరిధిలో 291 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీ దగ్గర నుంచి ఆర్‌డి, సూపరింటెండెంట్ మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఆర్‌డి చెప్పినట్టువినని అధికారులను విస్మరించి డిప్యూటేషన్‌పై అనుకూలురిని నియమించుకుని డిడి సంతకాలు లేకుండా పోస్టింగుల వ్యవహారం నడుపుతున్న నేపథ్యం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌డి చెప్పినట్టు వినని అధికారులపై అవిధేయత, పనితీరు సక్రమంగా లేదనే పేరుతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌డి కార్యాలయంలో పనిచేసే నలుగురు సూపరింటెండెంట్ల నిర్లక్ష్యం చేసే జిజిహెచ్‌కు చెందిన నుంచి ఓ అధికారిని డిప్యూటేషన్‌పై వేయించుకుని స్టాఫ్‌నర్సుల్, ఎంఎల్‌హెచ్‌పి పోస్టుల భర్తీ వ్యవహారంలో భాగంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేసినట్టు సమాచారం. సస్పెన్షన్ వ్యవహారం ముగియక ముందే సంబంధిత జిజిహెచ్‌కు చెందిన అధికారి రాజధాని కేంద్రమైన విజయవాడకు చేరుకుని సదరు సూపరింటెండెంట్ స్థానానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మహిళా నిరుద్యోగి స్టాఫ్‌నర్సు పోస్టు నిమిత్తం ఆర్‌డి, సూపరింటెండెంట్ పోర్జరీ సంతకాలతో కూడిన ఫేక్ ఉత్తర్వు సృష్టించి పులివెందులలో పిహెచ్‌సికి వెళ్లినట్లు సమాచారం. పులివెందులలో స్టాఫ్‌నర్సులు ముగ్గురు ఉన్న నేపథ్యంలో మరొకరి వేయడంతో పోటుచేసుకున్న ఉదంతం ఆధారంగా సస్పెన్షన్ తతంగం నడిచినట్లు సమాచారం. దీనిపై పులివెందుల పిహెచ్‌సి ఉన్నతాధికారి, చిత్తూరు డిఎంహెచ్‌ఓ ఫిర్యాదు ఆధారంగా పోలీస్ కేసు నమోదు చేసిన అనంతరం విచారణ చేపట్టాల్సి ఉన్నట్లు తెలిసింది. విచారణ చేపట్టకుండానే శుక్ర, శనివారాల్లో సాయంత్రం ఆరు గంటల వరకు విధుల్లో ఉన్న సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీను తనకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడమేమిటని వాపోతుండడం గమనార్హం. శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు విధుల్లో ఉండి ఎఫ్‌ఆర్‌ఎస్ వేసి హెల్త్ సంబంధిత సమస్యతో హాస్పిటల్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆగమేఘాల మీద సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై సదరు సూపరింటెండెంట్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి ఆర్‌డి కార్యాలయంలో చోటుచేసుకున్న లీలలను తీసుకెళ్లిన అనంతరం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆర్‌డి ఉన్నతాధికారి కోటేశ్వరిని ఫోన్‌లో సంప్రదించగా అవిధేయత, పనితీరు సక్రమంగా లేదనే పేరుతో పలుమార్లు మెమోలు ఇచ్చామని, అయినప్పటికీ సూపరింటెండెంట్ పద్ధతి మార్చుకోకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొనడం గమనార్హం. ఫేక్ ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకోని నేపథ్యంలో కేసు ఎలా నమోదు చేశారని, ఫేక్ ఉత్తర్వులు, సర్టిఫికెట్లు తయారీ వ్యవహారంలో [illegible] మార్పులకు ఎక్కువగా వేయడం, కోవిడ్‌లో పని చేసేందుకు సంబంధించిన వెయిటేజీ మార్పులు ఎక్కువగా వేయడం, పనిచేయనప్పటికీ చేసినట్లు సర్టిఫికెట్లు తెచ్చుకోవడం, ఎంఎల్‌హెచ్‌పీల విధుల నిర్వహిస్తున్న వారికి స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్‌లో వెయిటేజ్ మార్పులను కలపడం వంటి ఆరోపణల ఆధారంగా లోతైన విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుత సస్పెన్షన్ ఉదంతంలో నలుగురు సూపరింటెండ్స్‌తోపాటు డిప్యూటేషన్ల వచ్చిన అధికారుల పాత్రపైనా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు లోకి వచ్చే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

పుస్తకాలు లేకుండా పరీక్షలా? : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం విద్యార్థులకు రెండవ సెమిస్టర్ సంబంధించిన పుస్తకాలు ఇంతవరకు అందించకుండానే రేపటి నుంచి పరీక్షలు నిర్వహించడం చాలా విడ్డూరంగా ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు విమర్శించారు. సోమవారం యూటీఎఫ్ భవనంలో చింతకొమ్మదిన్నె మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం మంచిది కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఏడో తేదీ వచ్చినా ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించలేదని చాలామంది ఉపాధ్యాయులు హౌసింగ్ లోన్, పర్సనల్ లోన్లు ఉండడంవల్ల బ్యాంకులో డిఫాల్టర్స్‌గా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల మెడపై కత్తి పెట్టి పని చేయించుకుంటున్నా ప్రభుత్వం ఒకటవ తేదీ వేతనాలు చెల్లించడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె మండల ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, మండల సహాధ్యక్షురాలు ప్రత్యూష, ట్రెజరర్ వెంకటరమణ, నాయకులు కేదార్నాథ్, శ్రీకాంత్, పవన్ కుమార్, శైలజ, వెంకట, రమణయ్య పాల్గొన్నారు.

వైవీయూలో దూరవిద్య కోర్సులు : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వైవీయూ విసి జింక రంగ జనార్ధన్ వెల్లడించారు. డిడిఇ సంచాలకులు ఆచార్య పిఎస్ షావలి ఖాన్ అధ్యక్షతన రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి తో కలిసి వివిధ విభాగాల అధిపతులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, డీన్‌లతో కలిసి దూరవిద్య పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విడతల్లో 22 కోర్సులను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి తొలివిడతగా ఏడు డిగ్రీ, ఏడు పీజీ, రెండు డిప్లమో కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. అంతకు ముందుగా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సుల గురించి డీన్లతో సమీక్షించారు. కొత్త కోర్సులకు సంబంధించి సిలబస్, విధివిధానాలపై బోర్డ్ ఆఫ్ చైర్మన్లు చర్చించారు. సమావేశంలో డిడిఇ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ బాబు, డీన్లు, బిఒఎస్ చైర్మన్లు, అన్ని శాఖల పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించండి

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ వి. విజయ్ రామ రాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో సహా పలువురు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో.. దువ్వూరు మండలం, పెద్ద బాకారాపురానికి చెందిన డి. దస్తగిరి తన ఎద్దులు జబ్బు చేసి చనిపోవడం వల్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం చేయాలని అభ్యర్థించారు. కడప మండల కేంద్రానికి చెందిన టి. సుబ్బలక్ష్మిమ్మ తాను నిరుపేదనని తనకు రేషన్ కార్డు, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మైదుకూరు కు చెందిన ఎం చిన్న పుల్లారెడ్డి తన భూమి ఆక్రమణకు గురైందని తగు చర్యలు తీసుకోవాలని అర్జీని సమర్పించారు. కార్యక్రమంలో సిపివో వెంకట రావు, జడ్‌పిసిఇఒ సుధాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మెప్మా పీడి రామమోహన్ రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వర రావు, సమగ్ర శిక్ష ఎపిసి ప్రభాకర్ రెడ్డి, డిఇఒ దేవరాజు, ఐసిడిఎస్ పీడీ ఎం. ఎన్. రాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు హెపటైటిస్-బి టీకా ఉచితం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఉచిత టీకా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ ప్రిన్సిపల్ సురేఖ

ఎఆర్‌టి గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోని హెచ్‌ఐవి వ్యాధి గ్రస్తులకు ఉచితంగా హెపటైటిస్-బి టీకా ఉచితంగా వేయనున్నట్లు రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. సోమవారం కడప ఎఆర్‌టి కేంద్రంలో ఉచిత టీకా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయించుకోవడం వల్ల కాలేయ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. హెచ్‌ఐవి సోకిన ప్రతి ఒక్కరూ ఈ టీకా వేసుకోవాలని పేర్కొన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రామ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో కడప, ప్రొద్దుటూరు ఎఆర్‌టి సెంటర్లలో, హెచ్‌ఐవి బాధితులకు ఉచితంగా హెపటైటిస్-బి వ్యాక్సిన్ వేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఎంఒ డాక్టర్ ఖాదర్ వల్లి, జిల్లా అదనపు వైద్యాధికారి, ఎయిడ్స్ అండ్ లెప్రసీ, టీబి వైద్యులు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, ఎఆర్‌టి నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి బాయ్, జనరల్ మెడిసిన్ విభాగధిపతి, మైక్రోబయాలజీ విభాగధిపతి, డాక్టర్ గురువయ్య, ఏఆర్టి మెడికల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్ జిల్లా అధ్యక్షులుగా సాజిద్ హుస్సేన్

కడప అర్బన్ : నగరానికి చెందిన సాజిద్ హుస్సేన్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులుగా రాష్ట్ర కన్వీనర్ వరప్రసాద్ నియమించారు. ఈ సందర్భంగా సాజిద్ హుస్సేన్ ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ స్థాపించినప్పటి నుంచి సేవలందిస్తున్నానని పేర్కొన్నారు. తనను జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో మార్పు రావాలని, నిజాయితీగా పని చేసే పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ అని తెలిపారు. భవిష్యత్తులో పార్టీ కోసం సైనికుల్లా పని చేస్తానని చెప్పారు.

ఉత్సవాలకు అంతర్జాతీయ ప్రసంగీకులు రాక

కడప అర్బన్ : లూర్ధుమాత ఉత్సవాలకు అంతర్జాతీయ ప్రసంగీకులు ఫాదర్‌జెన్నీ, ఫాదర్ సగిలి ప్రకాష్ రానున్నారని గాబ్రీయేలు మౌలిక సంఘం అధ్యక్షులు మడగలం ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం లూర్ధు మాత ఉత్సవాల్లో భాగంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రాలను అభివృద్ధి పరచడంలో, విశ్వాసులను ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తున్న ఫాదర్స్ ఉత్సవాలకు రావడం ఎంతో శుభ పరిణామమని పేర్కొన్నారు. ఈనెల 10న సాయంత్రం నగర పురవీధుల్లో లూర్ధు మాత తేరు ప్రదర్శన, ఆరాదన, 11న ఉదయం గంటలకు దివ్యబలిపూ సమర్పణ, వాలీబాల్, చెక్క భజన బండలాడుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు సాయంత్రం పతాక అవరోహణ ద్వారా ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

ప్రతి ఇంటికీ పథకాలు : డిప్యూటీ సిఎం

కడప : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ పథకాలు అందజేస్తున్నా రని, ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదరించా లని ఉపము ఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నా రు. సోమవారం స్థానిక 47/1 డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ ఆధ్వ ర్యంలో అక్కాయపల్లె-3 పరిధిలోని పలు వీధులు, ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతి ఇంటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, డైరెక్టర్ బంగారు నాగయ్య, కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నిరంజన్ రెడ్డి, బాల స్వామిరెడ్డి, బండి ప్రసాద్, రెడ్డి ప్రసాద్, మగ్బుల్, వైసిపి నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి

కేంద్ర బడ్జెట్‌పై 9న బ్లాక్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు చూపని కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ కడపలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయం బిఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు ఎదుట ఈనెల 9న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గిస్తే రైతుల ఆదాయం ఏ రకంగా రెట్టింపు అవుతుందని ప్రశ్నించారు. 2022-23 బడ్జెట్లో పీఎం కిసాన్ నిధికి రూ.12,950 కోట్లు ఉంటే రూ.10,787 కోట్లకు తగ్గించారని తెలిపారు. వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించి వ్యవసాయ సంక్షోభం ఏ రకంగా నివారిస్తారని ప్రశ్నించారు. పిఎం కిసాన్ పథకం కింద రూ.6వేలు ఇస్తున్నారని తెలిపారు. ఇది ఏ మాత్రం చాలడం లేదని, వ్యవసాయ సాగు ఖర్చులు రెట్టింపు అయ్యాయని చెప్పారు. బడ్జెట్లో పీఎం కిసాన్ పథకాన్ని కూడా రెట్టింపు చేయాలని పేర్కొన్నారు. ఓ పక్కన లక్షలాది మంది రైతులు ఆత్మహత్య పరంపర కొనసాగుతూ ఉందని, మరో పక్క స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సీటు ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలను ఇవ్వకపోవడం దారుణమని వాపోయారు. ఎరువుల పై సబ్సిడీ గతం కంటే రూ.50 వేల కోట్ల తగ్గించారని చెప్పారు. ఉపాధి హామీ పథకానికి నిర్వీర్యం చేసే విధంగా గతంలో రూ.89.400 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో రూ. 9.067.85 కోట్లు తగ్గించారని పేర్కొన్నారు. కార్మికుల కోర్కెలకు ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. క్రూరమైన రైతు, వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, కేంద్ర బడ్జెట్ నిరసిస్తూ బ్లాక్ డే పాటించాలని, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

వెట్టి చాకిరీని నిర్మూలిద్దాం

కడప: 'వెట్టి చాకిరీ విధానాన్ని నిర్మూలిద్దాం-వ్యక్తి స్వతంత్రాన్ని పరిరక్షిద్దాం' అని జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి సి.ఎన్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ వారి సహకారంతో జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బొండెడ్ లేబర్ పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ స్టాప్ క్రైసిస్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 13 మంది సభ్యులుగా ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బొండెడ్ లేబర్ పై పనిచేస్తుందని వారు అన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బొండెడ్ లేబర్ అంశాలను వివరించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు.

ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కడప అర్బన్

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.కె.అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా, ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

11, 12న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

కడప అర్బన్ : నగరంలో సరోజిని నగర్‌లో సాయిబాబా ఆలయం దగ్గర మైదానంలో ఈనెల 11, 12 తేదీలలో రాయలసీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు టిడిపి నగర ప్రముఖులు కొండా సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 12న సాయంత్రం ముగింపు పోటీలలో విజేతలకు ముఖ్య అతిథులచే బహుమతులను అందజేస్తామన్నారు. క్రీడా అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వివరాల 8341307616, , 6188313343 సంప్రతించాలని తెలిపారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి - కడప



ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశంలో, రాష్ట్రంలో ఉన్న ఆస్తులను మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు కట్టబెట్టడం దారుణమని, వాటిని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతంరెడ్డి అన్నారు. ఆదాని గ్రూప్ వ్యాపార లావాదేవీలపై సమగ్ర విచారణ చేయాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసి మెయిన్ బ్రాంచ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విష్ణుప్రీతం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఎస్‌బిఐ, ఎల్ఐసి సంస్థల్లో ఉండేది పేదల సొమ్ము అని దాన్ని స్వాహా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ. 34 వేల కోట్ల ఆస్తులను అదానీ సంస్థకు కట్ట పెట్టడం అన్యాయమని వాపోయారు. **పాలసీదారులు ఆందోళన చెందొద్దు..** అదాని సంస్థల్లో పెట్టుబడుల కారణంగా ఎల్ఐసి పాలసీదారులకు ఇబ్బంది ఏమీ లేదని, వారి పొదుపు మొత్తాలు సురక్షితమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్ఐసి కార్యాలయం కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం పై ఆయన స్పందించారు. చెబుతున్న నష్టం ఊహాత్మకమైనదే తప్ప, నిజమైంది కాదని, ఎందుకంటే సంస్థల్లో ఉన్న తన షేర్లను వేటినీ ఎల్ఐసి సంస్థ అమ్మలేదన్నారు. అదాని గ్రూప్ సంస్థల్లో ఎల్ఐసి రూ.36,474.78 కోట్ల పెట్టుబడులు పెట్టిందని, వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.56,142 కోట్లని అన్నారు. ఆదాని షేర్లను అమ్మ లేదు కాబట్టి, ఆ రకంగా ఎల్ఐసి రూ.20వేల కోట్ల మేర ఊహాత్మక లాభాలను సాధించినట్లు వివరించారు. ఎల్ఐసిలో ప్రజల పెట్టుబడులు సంపూర్ణంగా సురక్షితమైనవని వివరించారు.

పేర్ల నమోదు తప్పనిసరి

వల్లూరు : రైతులు పండించిన పంటలు బుడ్డ శనగ, మినుము పంటలకు ప్రభుత్వ కల్పిస్తున్న గిట్టుబాటు ధర, కొనుగోలు చేయాలంటే రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని లేబాక రైతు భరోసా కేంద్రంలోబుడ్డశనగ, మినుము పంటలు కొనుగోళ్ల కోసం రైతుల పేర్లు నమోదు చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ సంచాలకులు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం మద్దతు ధరకు పంట అమ్ముకునే రైతులు తమ ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకొని సంబంధిత రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి బయోమెట్రిక్ లేదా ఒటిపి ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. బుడ్డ శనగ క్వింటా కనీస మద్దతు ధర రూ. 5335 , మినుము క్వింటా కనీసం మద్దతు ధర రూ.6600 ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థికి అధ్యాపకుడు రక్తదానం


పోరుమామిళ్ల టౌన్ : బ్రహ్మంగారిమఠం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన శివకుమారిని తల్లిదండ్రులు పోరుమామిళ్లలోని ఒఎల్‌ఎఫ్ ఆస్పత్రిలో చేర్పించారు. రక్తం తక్కువై నీరసంతో స్పృహ లేకుండా ఉందని వైద్యులు తెలిపారు. వెంటనే ఓ నెగిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోమని తల్లిదండ్రులకు చెప్పగా, వారు రైట్ హ్యాండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్టు ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ వెంకట్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు రసూల్ ,ప్రసాద్ తొమ్మిదవ సారి రక్తదానం చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అఖిల్, విజయ్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

శ్వేత పత్రం విడుదల చేయాలి : టిడిపి

కడప అర్బన్ : పదో తేదీ వస్తున్నా ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు చెల్లించకపోవడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం జాప్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చిన ఆదాయాన్ని, నిధులకు తమ ఖాతాల్లో వేసుకుని దారి మళ్లీస్తున్నారని తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని తెలిపారు. పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని స్థితిలో ఉందని పేర్కొన్నారు. వైసిపి సర్పంచ్‌లే ఆందోళన దిగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అప్పులు రాష్ట్ర ప్రజల పై భారం వేస్తుందని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే ఉద్యోగస్తుల పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు.

'యువతను మోసగించిన ప్రభుత్వం'

ప్రజాశక్తి - వేంపల్లె


తులసిరెడ్డిని సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

వైసిపి ప్రభుత్వం యువతను నమ్మించి మోసం చేసిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ విమర్శించారు. స్థానికంగా ఉన్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని సోమవారం కాంగ్రెస్ యువజన నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో యవజన కాంగ్రెస్ బలోపేతంపై తులసిరెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ ప్రత్యేకహోదా సాధించి ఉద్యోగాల విప్లవం తీసుకొస్తామని చెప్పి మాట మార్చారని తెలిపారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను వైకాపా ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండరును కూడా విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంతాకుమార్, పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు సాయి, ప్రొద్దుటూరు యువజన అధ్యక్షుడు వంశీ యాదవ్, ధ్రువకుమార్‌రెడ్డి, శివయ్య, వెంకటేష్, అమర్, రామకృష్ణ పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో కొత్త భవనాలు

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రమైన లింగాలలో రూ.40 కోట్లతో కొత్త కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నట్లు తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల నిర్మాణానికి పాడా నిధుల రూ.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం సొసైటీ బ్యాంకు వద్ద 50 సెంట్లు స్థలం ఖాళీ ఉందని, అందులో ఆ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ ఉన్న సొసైటీ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ భవనం వద్దకు మార్చేందుకు అధికారులు ఆలోచిస్తున్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు ఇరుకుగా ఉండడంతో కొత్తవి నిర్మిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు.

ఎమ్మెల్సీ విజయానికి ప్రచారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న కిషోర్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు గాంధీనగర్, సీయోనుపురం పరిసర ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. కౌన్సిలర్ కిషోర్, వైసిపి కన్వీనర్ చాంద్ బాషా ఓటర్లను కలిసి అభ్యర్థించారు. ఈ సంద్భంగా వారు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవీన్ కుమార్, విశ్వనాథ్, విష్ణు, వర్ధన్ పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

డ్వాక్రా గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించేలా ఆర్‌పిలు చూడాలని పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్ సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సోమ వారం సిఒలు, ఆర్‌పిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌పిలు ప్రతి ఒక్కరూ మీ వార్డులో ఉన్న గ్రూపులలో డబ్బులు సక్రమంగా చెల్లించని వారితో, ప్రతిరోజు మూడు గ్రూపులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఆర్‌పిలు సంఘాలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిఒలు హరిత, నాయుడు, ఆర్‌పిలు అరుణకుమారి, దేవి, టిఎల్‌ఎఫ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని లింగాపురం ఎస్‌ఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మోపూరి మహేష్ (16) అక్కడికక్కడే మృతి చెందగా, మృతుడి తండ్రి మోపూరు రాజారత్నం గాయ పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. చాపాడు మండలం నక్కలదిన్నె అనంతపురం గ్రామానికి చెందిన మహేష్ అలియాస్ ఆనంత్‌కుమార్, మహేష్ తండ్రి రాజా రత్నం బైక్‌లో ప్రొద్దుటూరు వైపు వెళుతున్న లారీని క్రాస్ చేస్తుండగా.. అడ్డు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయ పడిన రాజారత్నంను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు మృతితో నక్కలదిన్నెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రూరల్ ఎస్ఐ హైమావతి కేసును దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనాస్థలంలో విలపిస్తున్న మహేష్ తల్లి

చాపాడు : మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల పరిధిలోని నాగులపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన తొండలదిన్నె దస్తగిరి (68) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి మైదుకూరు కడప రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ప్రొద్దుటూరు వైద్యశాలకు వెళ్లి వస్తుండగా నాగుల పల్లెకు రాగానే వెనుక వైపు వస్తున్న ఎపి 04 బివై 3933 నెంబర్ గల కారు ఢీకొంది. ఈ దుర్ఘటనలో దస్తగిరికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఐదు మంది కుమారులు కాగా.. పెద్ద కుమారుడు, దస్తగిరి భార్య గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మిగిలిన నలుగురు కుమారులు జీవనోపాధి కోసం కువైట్‌లో ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన దస్తగిరి

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ పరిధిలోని ఆర్‌కె నగర్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని సోమవారం అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. ఆ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారి వద్దనుంచి రూ.8,650నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

పాతగోపులాపురంలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిన్నదండ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని పాత గోపులాపురంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. పది రోజులుగా కుళాయిలకు మంచినీరు రావడంలేదని, సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకెళ్లి తాగునీరు తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. తాగునీరు తెచ్చుకునేందుకు మహిళలు, వృద్ధులు తీవ్ర ఇక్కట్లక గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ సెక్రటరీ సాంబశివారెడ్డిని వివరణ కోరగా.. గ్రామంలో నీటి సమస్య ఉండడం వాస్తవమేనని, మోటరు వైండింగ్ పోవడంతో రిపేరుకు ఇచ్చామని తెలిపారు. రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.


పొలాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్న ప్రజలు

వైద్య ఆరోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే


అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

వైద్య ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కన్నెల్లూరు నేతాజీనగర్‌లో నూతనంగా నిర్మించిన వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రభుత్వం రూ.80 లక్షలతో నిర్మించిందన్నారు. మెరుగైన ఆరోగ్య వసతులను కల్పించడంలో తమ ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని కొన్ని వేల కోట్లను వెచ్చించడానికి కూడా ప్రభుత్వం వెనకాడడం లేదన్నారు. కరోనా సమయంలో ప్రభుత్వం ప్రజలందరినీ అప్రమత్తం చేసి వైద్యాన్ని ప్రజల చెంతకు చేర్చిందన్నారు. జమ్మలమడుగు పట్టణ ప్రజలు అందరూ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో 108, 104 వాహనాలు పాడైపోయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ వాహనాలను మార్చి కొత్తవి తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ పోచిరెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, డైరెక్టర్ మార్బుల్ శ్రీను, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, హనుమంతరెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ బాల మల్లేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - మైలవరం

ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దొమ్మరనంద్యాల సచివాలయ పరిధిలో సోమవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ వచ్చారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, వై.శివభాస్కర్‌రెడ్డి వినయ్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయ యాదవ్, జడ్‌పిటిసి మహాలక్ష్మి, జగదీశ్వర్‌రెడ్డి, బడికిం బి.చంద్రమౌళి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, 14 ఏళ్ల టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ వైయస్సార్ పాలనలో కొంత అభివృద్ధి జరిగిన మాట వాస్తవమని, వైసిపి ప్రభుత్వం వచ్చినతర్వాత రూ.700 కోట్లతో పనులను వేగవంతం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈద్గాలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు ఇర్ఫాన్‌బాషా, కమల్‌బాషా, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్ట బాలాజీ, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఈద్గా శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు

సంక్షేమ పథకాల అమలులో అగ్రస్థానం

సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం 200వ రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.. ప్రకాష్‌నగర్‌లో సోమవారం కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఎమ్మెల్యే రాచమల్లు వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో అప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మాజీ ఉప మండల అధ్యక్షుడు రాజారాంరెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పూసల సంఘం డైరెక్టర్ వెంకటరమణ, ఎంపిటిసి బాలాజీనివాస్, వార్డు మెంబర్లు లక్ష్మీనారాయణరెడ్డి, తాటి లక్ష్మీదేవి, తిరుపాల్‌రెడ్డి, ప్రకాష్‌నగర్ కన్వీనర్ కంభం వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మాజీ ఎంపిటిసి సత్యం, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలి

ప్రజాశక్తి - వేంపల్లె

చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ప్రతిభ చూపాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆట స్థలంలో సోమవారం నిర్వహించిన షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికను నాగేంద్ర ప్రారభించారు. జిల్లా స్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ క్రీడాల్లో ఆయా పాఠశాలల బాలుర, బాలికలు పాల్గొన్నారు. క్రీడలతో మంచి గుర్తింపు వస్తుందని సూచించారు. జిల్లా జట్టులో ఎంపికైన విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని హనుమాన్ జంక్షన్‌లో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి మాదినేని నిత్యపూజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర

సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సృజన్ కోచింగ్ సెంటర్ బృందం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షలో విజయ కేతనం ఎగరవేశారని ఆ కోచింగ్ సెంటర్ యాజమాన్యం కె.సృజన్ తెలిపారు. స్థానిక ఎస్‌పి డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి డిగ్రీ కళాశాల యాజమాన్యం సహకారంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇక్కడే శిక్షణ ఇచ్చామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన విద్యార్థులు కె.నాగేష్, మహమ్మద్ గౌస్, నాగేంద్ర బాబు, చంద్రపవన్, సంధ్యరాణి, నీరజేశ్వరి, మనోజ్‌గా వివరించారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, పట్టుదలే ఈ విజయానికి కారణమన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ పి.నాగేశ్వరరెడ్డి, అధ్యాపకులు పి.రాజు, డి.విజయ శేఖర్, తిలక్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : మండలంలోని ఆయా ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. 33/11 కెవి సబ్‌స్టేషన్‌కు చెందిన టి.వెలమవారిపల్లె, అలిరెడ్డిపల్లె, తాళ్లపల్లి, వైఎస్ రాజారెడ్డినగర్‌లో 11 కెవి ఫీడర్స్, నెలవరం తండా, చౌడమ్మగుట్ట, అలిరెడ్డిపల్లె, తాళ్లపల్లి రూరల్, ఈదుల బావి, బలపాల గుట్ట ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. ఆయా సబ్‌స్టేషన్‌లకు సంబంధించిన 11 కెవి ఫీడర్లలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని జెఇ కోరారు.

ఫ్యాషన్ డిజైన్‌లో ఉచిత శిక్షణ



చైర్మన్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక పాత మార్కెట్‌లో శ్రీసత్యసాయి మందిరంలో బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వారు 60 మంది మహిళలకు 40 రోజుల పాటు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, బ్రీడ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. సత్యసాయి జిల్లా అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ జిల్లాలో చేస్తున్న సేవలు వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ ఇన్‌ఛార్జి నాగప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2022లో 6000 మందికి వృత్తివిద్యలో శిక్షణనిచ్చామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, శ్రీసత్యసాయి మందిరం వైస్ ప్రెసిడెంట్, జిల్లా బాల వికాస్ కో-ఆర్డినేటర్, కన్వీనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని దత్తాపురం పునరావాస కాలనీలో మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం వరకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మెగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆగ్రామ అన్నెం వాసిరెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ తన తల్లిదండ్రుల నాగలక్ష్మమ్మ, రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ స్వరూపరాణి, డాక్టర్ శివతేజారెడ్డి, డాక్టర్ హారికరెడ్డి కంటి పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. దత్తాపురం-1 పునరావాస కాలనీలో కమ్యూనిటీ భవనంలో పరీక్షలు చేయనున్నట్లు వాసిరెడ్డి తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చాపాడు


మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మమయ్య

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపిపి టి. లక్ష్మమయ్య సూచిం చారు. స్థానిక పిహెచ్‌సిలో సోమవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని వైద్యాధికారి రాజేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన అన్ని రకాల వసతులను కల్పించాలన్నారు. గర్భిణులకు మందులు సిఫిలిస్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. రిజిస్టర్ నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమిటీ ఆధ్వర్యంలో నిధుల వినియోగంపై చర్చించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎంపిటిసి సల్మా, సూపర్‌వైజర్ సరస్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ వ్యవహారంలో మోడీ వైఖరి శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలను తడుముకొన్నట్లుంది అదానీ వ్యవహారంలో ప్రధాని మోడీ ప్రభుత్వ వైఖరి అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోడీకి, హోంశాఖ మంత్రి అమిత్‌షాకు మిత్రుడైన గౌతం అదానీ కంపెనీల అవకతవకలపై జెపిసితో గాని సుప్రీంకోర్టు పర్యవేక్షణతోగాని విచారణ జరిపించాలని పార్లమెంటులో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగా, మోడీ ప్రభుత్వం విచారణకు ఆదేశించకుండా పారిపోవడం శోచనీయమన్నారు. మారిషస్, బహామాస్, వర్జిన్ ఐలాండ్ ట్యాక్స్ హెవెన్ దేశాల్లో అదానీ సోదరులు బోగస్ సెల్ కంపెనీలు పెట్టారని ఆరోపించారు. నల్ల డబ్బులను వాటిలో పెట్టి అక్కడి నుండి స్టాక్ మార్కెట్లో పెట్టి అదానీ కంపెనీల షేర్ల విలువ అనూహ్యంగా పెంచారని తెలిపారు. ఆలస్యం చేయకుండా విచారణకు ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

దివాలా తీసే స్థితిలో రాష్ట్రం : 'పుట్టా'

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి పాలనతో రాష్ట్రం దివాలా తీసే పరిస్థితికి చేరుకుందని మైదుకూరు టిడిని ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండలంలోని బద్రిపల్లె గ్రామంలో సోమవారం ఆయన రాష్ట్రానికి ఇదేం ఖర్మ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడనున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ మండల శాఖ అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, సర్పంచు గుత్తి మల్లేశ్వరి, నారాయణ, టిడిపి నాయకులు మిల్లు శీను, సుదర్శన్, నారపరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ తోట్టి అబ్దుల్ కరీం, లక్ష్మీ నారాయణరెడ్డి, వెంకట రమణారెడ్డి, హరి కిరణ్ పాల్గొన్నారు.

11న లోక్ అదాలత్

ప్రజాశక్తి - చాపాడు


మాట్లాడుతున్న ప్రభుత్వ తరపు న్యాయవాది జ్వాల నరసింహ శర్మ

ఈ నెల 11న మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు కోర్టు ప్రభుత్వ న్యాయవాది జ్వాలా నరసింహ శర్మ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం రెవెన్యూ సిబ్బంది, ప్రజలకు సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వాలా మాట్లాడుతూ వివిధ రకాల సమస్యలతో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం న్యాయశాఖ లోక్‌అదాలత్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రెవెన్యూ, భూ సమస్యలు ప్రజలు పరిష్కరించుకునేలా రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. తహశీల్దార్ సుభాని మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

చెరకు సాగు.. ఆదాయం బాగు

ప్రజాశక్తి - ఖాజీపేట

చెరకు సాగు మంచి ఆదాయాన్నిస్తోందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని చెముళ్లపల్లె గ్రామ రైతులు ప్రతి ఏడాది చెరుకు పంటను సాగుచేస్తూ అధిక ఆదాయం అర్జిస్తున్నారు. ఎకరా పంటను సాగు చేస్తే లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా చెరుకు సాగునకు రూ.40వేలు పెట్టుబడి అవసరమని తెలిపారు. వేసవికాలం కావడంతో స్థానిక చెరుకు రసం వ్యాపారులు పొలాల వద్దకే వెళ్లి చెరుకును కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఏటా 150 ఎకరాలకు పైబడి చెరుకును సాగు చేస్తుంటామని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే మరింత మంది చెరుకు సాగుకు రైతులు ముందుకు వస్తారని పలువురు పేర్కొంటున్నారు. స్థానిక చెరుకు రసం వ్యాపారంపై ఆధారపడడం కంటే చక్కెర కర్మాగారం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఎకరాకు 30 టన్నులు చెరుకు దిగుబడి వస్తుందని తెలిపారు. గతంలో ఖాజీపేట మండలంలో చెరుకు సాగు అధికంగా ఉండేది. అప్పట్లో రైతులు పొలంలోనే బెల్లం తయారు చేసి విక్రయించేవారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీకి చెరుకులను రైతులు తరలించేవారు. ఆ ఫ్యాక్టరీ మూత పడడంతో ఈ ప్రాంతంలో చెరుకు సాగు ఘననీయంగా తగ్గిపోయింది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి మూత పడిన చెక్కర ఫ్యాక్టరీని తెరిపిస్తే చెరుకు రైతులకు ఊరటగా ఉంటుంది. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.


చెముళ్లపల్లె పొలాల్లో సాగులో ఉన్న చెరకు పంట